ప్రవాసాంధ్ర కథ

# తెలంగీ పత్తా



అఫ్సర్

'అబ్బా, ఏ హమారా గామ్ నై'

నిద్ర పట్టక అటూ ఇటూ మసలుతున్న నా వొంటిమీద ఎవరో చర్నాకోల కొట్టినట్టయ్యింది. ఇది మున్నా గొంతేనా?

పక్కకి తిరిగి చూసాను.

మంచానికి అవతలిపక్క రజియా మంచి నిద్రలో వుంది. పగటి అశాంతినీ, అసహనాన్నీ సాఫుగా చెరిపేసి ప్రశాంతమైన నిద్రలో వుంది రజియా. మధ్యలో పడుకున్న మున్నా నాలాగే మంచమ్మీద అటూ ఇటూ కదులుతున్నాడు, చాలా ఇబ్బందిగా.

ఇంతకుముందు వాడు నిద్రపోయినప్పుడు వాడి పెదాల మీద సన్నటి నవ్వు విచ్చుకునేది. అది మొహమంతా అయ్యి, ఓ గొప్ప అందం వాడి లేతమొహమ్మీద మొగ్గ తొడిగేది. ఆ మొగ్గ నా లోపలి ఆలోచనలమీదా, గాయాలమీదా మెత్తగా చల్లగా ఒక సన్నటి గాలి అలలాగా తాకేది. నా లోపలి అశాంతి అంతా ఎటో పారిపోయేది.

వాడి మొహంలో ఇప్పుడు ఆ నవ్వు లేదు. ఏదో చెప్పలేని అశాంతిని దాచుకున్నట్టు, దాన్ని దాచుకోలేక అవస్థపడుతున్నట్టుగా వుందిప్పుడు. నిద్రపట్టక నేను పడుతున్న నరకయాతనని వొక బొమ్మగేస్తే, బహుశా అది ఇప్పుడు మా మున్నా ముఖంలో వుంటుందా?

నెలరోజుల కిందట -

నేను అప్పుడే చెప్పుల షాపు నుంచి ఇంటికి వచ్చా. కాళ్ళూ చేతులూ కడుక్కోబోతుంటే మున్నా పరుగు పరుగున వచ్చి నన్ను వెనకనించి రెండు చేతులతో గట్టిగా పట్టుకున్నాడు.

'అబ్బా, ఇవాళ శీనూ నాతో ఆడుకోలేదు. ఇంక వాడు నాతో ఆడడట' అన్నాడు ఏడుస్తూ.

ఇంతలో రజియా 'వాడు ఆడకపోతే ఏం పర్లేదు. రేపు నేను జావెద్‌ని పిల్చుకొస్తా. వాడూ నువ్వూ ఎంతసేపయినా ఆడుకోవచ్చు' అని కేకేసింది.

మున్నా వినలేదు.

శీనూ వీడికి మంచి దోస్తు. మున్నా అంటే వాడికి చాలాఇష్టం కూడా. ఏమైందో నాకు అర్థం కాలా. 'ఏమైందమ్మా? మీ ఇద్దరూ రోజూ కలిసి ఆడుకుంటారు కదా...! ఇప్పుడేమైంది?'

'వాళ్ళ మమ్మీ వద్దందట'

'అదేమిటి?' అని రజియా వైపు తిరిగాను నేను.

'క్యా మరేకి?' (ఏంచచ్చారో?) అంది రజియా అది వొక చర్చ కావడం ఇష్టం లేదన్నట్టుగా.

'నువ్వు చెప్పమ్మా, మున్నా!' అన్నాను వాణ్ణి దగ్గిరికి తీసుకుని.

వాడు నా వొళ్ళోకి వచ్చి కూర్చున్నాడు.

'అబ్బా, వాడు ఇవాళ నన్ను తిట్టాడు కూడా'

'ఏమని?'

'నేను బ్యాడ్ బాయ్‌నంటా'

ఇంతలో రజియా వచ్చి- 'ఏం వాడితోనే ఆడుకోవాలా? ఆడుకోడానికింక నీకు పిల్లలే లేరా? జావెద్, రాబియా, రీహానా, సాజిద్..'

'శీనూ, సుబ్బూ ఏమయ్యారు?' అన్నాన్నేను.

'ఇంతయ్యాక వాళ్ళు మన పిల్లాడితో ఆడుకోడానికి వస్తారా?'

'ఏమైంది?' నా ఆలోచనలు వాళ్ళ ఆటల ప్రపంచాన్ని దాటి వెళ్ళలేకపోతున్నాయి ఎంత ఆలోచించినా.

'ఏమీ ఎరగనట్టు ఎందుకలా మాట్లాడతారు?' మన పిల్లాడు ఎగురుకుంటూ వెళ్ళడమే కానీ, ఆ పిల్లలు మనింటి ఛాయలక్కూడా రావడం లేదు'.

'నిజమా?'

'నా ఖర్మ, మీకేమీ పట్టధూ, అర్థం కాదూ, నేను వచ్చినప్పుడే చెప్పానా, మనం ఖిల్లాలోనే ఇల్లు తీసుకుందాం, తీసుకుందాం అని. మీకు పడితేనా? మీరు వొట్టి తెలంగీ పత్తా...'

'ఏంటలా అంటావు?' అన్నాను కోపంగా దాదాపూ అరిచినట్టుగా.

'ప్రతీదానికీ ఆ మాటొకటి...' అన్నాను విసుగ్గా.

'నిజం కాదా మరి?' మీరు ఏనాడైనా ముసల్మాన్‌లాగా వున్నారా? ఆలోచించుకోండి మీరే' అంటూ విసవిసా వంటింట్లోకి వెళ్ళిపోయింది రజియా.

'అది సరే, ఇప్పుడు మున్నా సంగతి చెప్పు' అన్నాను ఆమె వెనకాలే వెళ్ళి.

'ఏముందీ? ఇక్కడే కొన్నాళ్ళుంటే వాడు ఎటూ కాకుండా పోతాడు. వాడితో హిందువుల పిల్లలు ఎవరూ ఆడుకోరు. ఖిల్లా లోపలికి వెళ్తే రానివ్వరు' అంది రజియా.

నేను ఆలోచనల్లో పడ్డాను.


** ** **

ఖిల్లా...

ఈ టౌన్‌కి వచ్చినప్పణ్నించీ నన్ను వెంటాడుతోంది.

టౌన్‌లో ముప్పాతిక శాతం ముసల్మాన్ల ఇళ్ళు ఖిల్లాలోపలే వున్నాయి. ఆ మాటకొస్తే ఖిల్లాలోపల వున్నవాళ్ళే అచ్చమైన ముస్లింలు అని పేరు. ఈ విషయం నేను మా వూళ్ళో వున్నప్పుడే విన్నాను. అమ్మ పోయిన తర్వాత ఇంక నాకు ఆ వూళ్ళో వుండాలనిపించలేదు. నేను చేయగలిగింది కూడా ఆ వూళ్ళో ఏమీ లేదు. స్టేషన్ దగ్గిర నేను పెట్టుకున్న చిన్న పాన్ డబ్బాతో రోజులు వెళ్ళమార్చడమూ కష్టమైపోయింది. పాన్ డబ్బాలో కూర్చొని నేను అమ్ముడుపోని తెలుగు పేపరు చదువుకుంటూ కాలక్షేపం చేసేవాణ్ని.

అప్పుడప్పుడూ టౌన్ నుంచి వచ్చే అహ్మద్‌సాబ్ తప్ప నాకు చుట్టాలు ఎవరూ లేరు. ఆయన కూడా రజియా తరఫు చుట్టమే తప్ప నా చుట్టం కాదు. రజియాకి ఆయన సొంత మామూ. నాకు చుట్టాలెవరైనా వున్నారూ అంటే స్టేషన్‌లో గాలికి తిరిగే ఉస్మానూ, నాతో పాటు టెన్త్ తప్పి, తోచినప్పుడు మంగలి డబ్బా తెరిచే సీతారామూ, పనీపాటా ఏమీ లేకుండా ఏ టీ కొట్టులోనో కూర్చొని రాజకీయాలు చెప్పే సత్యమూ... రజియా ఎప్పుడూ తిడుతూనే వుంటుంది 'గాలి బ్యాచీ అంతా నీ చుట్టే వుంది' అని. వున్న నలుగురైదుగురూ తెలంగీలు. సరే, ఉస్మాన్‌ని ఆమె ఏనాడూ మనిషిగా గుర్తించేది కాదు. కాబట్టి, వాడు తురకాడైనా లెక్కలోకి రాడు. ఆ రకంగా మా వాళ్ళు నాకు వేసిన ముద్ర తెలంగీ పత్తా.



ఊళ్ళో వున్నంతకాలం నా మీదా, నా బతుకుమీదా, ఇంట్లో అన్నీ నిండుకుపోయినప్పుడూ 'తెలంగీ పత్తా...కాకాకీ' అనేది. ఇప్పుడు టౌన్‌కి వచ్చిన తర్వాత ఆ రెండు పదాల తిట్టుకి ఇంకో వాక్యం తోడైంది. ఏ లోపం జరిగినా 'నేను చెప్పానా, మనం ఖిల్లాలో వుంటే అసలు ఇలా జరిగేదే కాదు' అంటుంది. ఈ వాక్యం నా రోజువారీ బతుకులో కనీసం పది సార్లు వినిపిస్తుంది.

ఈ టౌన్‌కి రావడం నా ఇష్టప్రకారం జరిగిందేమీ కాదు. రజియా మామూ దాదాపూ మమ్మల్ని ఇక్కడికి తోసుకువచ్చాడని చెప్పాలి.

వూళ్ళో ఓ రోజు నేను పాన్‌డబ్బాలో కూర్చొని, ఎప్పటి మాదిరిగానే అమ్ముడుపోని తెలుగు పేపరు చదువుకుంటున్నా.

చుక్కలా వూడిపడ్డాడు రజియా మామూ అహ్మద్‌సాబ్.

'జనాబ్, ఏ తెలంగీ ఛోడో. ఉర్దూ అక్బార్‌తో పడో' అంటూ.

నేను పేపర్ మడిచి స్టాండ్‌లోవేలాడదీశాను.

'ఎంతకాలం ఇక్కడ మఖ్ఖీ, మచ్చర్‌లతో కాలక్షపం చేస్తావు. టౌనుకొచ్చేయ్. అక్కడ ఏదో షాపులో కుదురుకోవచ్చు' తన ధోరణిలో మాట్లాడడం మొదలెట్టాడు అహ్మద్‌సాబ్.

'అక్కడ నేను చేసేదేముంది?'

'టౌన్‌లో ఏంచేసినా కాసిని డబ్బులు చేతిలో పడతాయి. అక్కడంతా మనవాళ్ళే కదా' అన్నాడాయన రెండు చేతులతో తనివితీరా గడ్డం సవరించుకుంటూ.

ఆయన దృష్టిలో మనవాళ్ళు అంటే నాకు స్పష్టమే. కాని ఆయనకి 'మన'వాళ్ళు నాకు కూడా అయినవాళ్ళు అవుతారంటే నాకు అనుమానమే. నేను ఉర్దూ, అరబ్బీ బాగా చదువుకున్నా, మొదట్లో పంజ్‌గానా నమాజ్ అదా చేసినా నిజానికి నేను వాళ్ళ దృష్టిలో పాక్ ముసల్మాన్‌ని కానేకాదు. నేను తెలంగీతలతో చేరిపోయానని వీళ్ళ అనుమానం.

అమ్మని గోరీమా అని దగ్గిరకు తీసుకుంటారు. కానీ, నన్ను మాత్రం ఎప్పుడూ పరాయివాడిగానే చూస్తారు. నాన్న పోయిన తర్వాత నిజానికి మా కుటుంబాన్ని పట్టించుకున్న దిక్కు లేదు. వున్న కాసింత జాగా చుట్టాలు ఏదో వొక పేరు చెప్పి లాక్కుపోతే, మా నెత్తిమీద మిగిలింది ఇప్పుడో అప్పుడో అన్నట్టున్న 'ఛత్' (నీడ-ఇల్లు) అది కూడా లేకుండా చేద్దామని మరీ దగ్గిర చుట్టాలు ప్రయత్నించారు. కానీ, అమ్మ పడనివ్వలేదు. దాంతో అమ్మని 'మొండిగోరీమా' అనడం మొదలెట్టారు. ఈ మొత్తం వ్యవహారంతో నాకు నాచుట్టాలన్నా, 'మనవాళ్ళు' అనే వాళ్ళన్నా రోత పుట్టింది.

అమ్మని గోరీమా అని దగ్గిరకు తీసుకుంటారు. కానీ, నన్ను మాత్రం ఎప్పుడూ పరాయివాడిగానే చూస్తారు. నాన్న పోయిన తర్వాత నిజానికి మా కుటుంబాన్ని పట్టించుకున్న దిక్కు లేదు. వున్న కాసింత జాగా చుట్టాలు ఏదో వొక పేరు చెప్పి లాక్కుపోతే, మా నెత్తిమీద మిగిలింది ఇప్పుడో అప్పుడో అన్నట్టున్న 'ఛత్' (నీడ-ఇల్లు) అది కూడా లేకుండా చేద్దామని మరీ దగ్గిర చుట్టాలు ప్రయత్నించారు. కానీ, అమ్మ పడనివ్వలేదు. దాంతో అమ్మని 'మొండిగోరీమా' అనడం మొదలెట్టారు.

అమ్మ ఉర్దూ, అరబ్బీ పాఠాల మీద ఎలాగో నన్నింతవాణ్ణి చేసింది కానీ, ఏ పూట వుంటుందో ఏ పూట వుండదో అన్నట్టే గడిచింది బతుకంతా. నాన్న చనిపోవడం, ఇంటి బాధ్యతలు పైన పడడంతో చదువు పోయింది. చెల్లి పెళ్ళికి, పెద్ద అప్పు మిగిలింది. ఈ మొత్తం బతుకు పోరాటంలో అండగా నిలిచినవాళ్ళెవ్వరూ లేరు. నేను ఈ కాస్త పాన్‌డబ్బా పెట్టుకోడానికైనా డబ్బూ దస్కం ఇచ్చి నిలబెట్టినవాళ్ళు తెలంగీ దోస్తులే. ఇంక నేను తెలంగీ పత్తా అవడంలో ఆశ్చర్యం ఏముంది?

'గోరీమా, మీరు ఫజర్ నుంచి ఇషా దాకా ఉర్దూ, అరబ్బీ మీద బతుకుతారు. మీ పిల్లాడు మాత్రం తెలంగీ పిల్లకాయలతో తిరుగుతుంటాడు' అని అందరూ అమ్మ మొహమ్మీదనే అనేవాళ్ళు.

అమ్మ కూడా చాలాసార్లు చెప్పి చూసింది.

'బాబూ, తిరిగేదేదో మనవాళ్ళతో తిరగొచ్చు కదా' అనేది.

'ఎవరమ్మా మనవాళ్ళు?' అని నేను తిరిగి మాట్లాడడం మొదలెట్టేసరికి అమ్మకి ఏమనాలో తెలిసేది కాదు. 'మేరే పేట్‌మే ఏక్ తెలంగీ పత్తా నిక్‌లా' అని బాధపడి ఊరుకునేది.

దీనికితోడు నాకు సత్యంతో పరిచయం చాలా పెద్ద మార్పు. సత్యం వాళ్ళింటికి టౌన్నుంచి చాలామంది వచ్చే వాళ్ళు. ఎవరో తెలియదు కానీ, వాళ్ళంతా బాగా చదువుకున్న వాళ్ళనీ, వాళ్ళందరికీ ఈ లోకం మీద బాగా కసి వుందనీ నా చిన్న బుర్రకి అర్థమైంది. కొన్నాళ్ళ తర్వాత సత్యం చేతిలో

వున్న గడ్డపాయన పుస్తకాలు నాకు వొక ఆకర్షణ అయ్యాయి. నేను అవి ఇంటికి తెచ్చి చదువుతుంటే 'ఏరా, ఆ వచ్చిన నాలుగు ఉర్దూ, అరబ్బీ ముక్కలు మెరుగు పెట్టుకోవచ్చు కదా, మధ్యలో ఈ దాడీవాలా ఎవరు?' అనేది అమ్మ నా పుస్తకాల వైపు అనుమానంగా చూస్తూ.

ఆ పుస్తకాలు చదువుతున్నానన్న మాటే కానీ, అందులో వొక్క ముక్క కూడా నాకు ఎక్కడం లేదు. అదే సంగతి సత్యాన్ని అడిగితే- 'అన్నీ అర్థం కావాలా? మీవాళ్ళు ఫజర్ నుంచి ఇషాదాకా చదివే దాంట్లో వొక్క ముక్కకి అర్థం చెప్పమను. మా వాళ్ళు ప్రతిదానికీ మంత్రాలు చదువుతారు కదా, వొక్కటంటే వొక్కటి వీళ్ళకి అర్థమై చచ్చిందా?' అనేవాడు సత్యం.

నిజమే, కాని ఈ దాడీవాలా పుస్తకాల్లో ఏదో కనికట్టు వుంది. నాలో ఎక్కడో వున్న అసంతృప్తి మీద టార్చిలైట్ వేసినట్టుగావుంది. మా రజియా ఉర్దూ, అరబ్బీ తప్ప లోకంలో ఇంకో భాష వున్నట్టే గుర్తించదు. తెలుగక్షరాలు ఎక్కడైనా కనిపిస్తే, వాటిని చూస్తే చాలు అప్పటికప్పుడే యమర్జెంటుగా నరకానికి వెళ్ళిపోతామన్నంత కంగారు పడుతుంది. అలాంటిది నేను ఏకంగా తెలుగు పుస్తకాలే ఇంట్లోకి తెచ్చి చదువుతూంటే ఇక ఆమెబాధా, కోపం అంతా ఇంతా కాదు. అసలు దరిద్రమంతా ఇంట్లో ఈ తెలుగు పుస్తకాల వల్లనే అనుకుంటుందామె. పాన్ డబ్బాలో నేను తెలుగు పేపర్లు వేలాడదీస్తే 'వో కాఫిర్ హుర్ఫ్ వున్నంతకాలం నీ డబ్బా సరిగ్గా నడవదంటే వినవు నువ్వు' అని శాపనార్థాలు. కాఫిర్ హుర్ఫ్...అంటే సైతాన్ అక్షరాలని ఆవిడ అర్థం.

**     **     **

నేను తెలంగీ పత్తానే అయివుంటాను. కాదనలేను. నేను ముసల్మాన్‌ని కానా? అవుననలేను.

రజియా నన్ను ఇలా అనడం కొత్తకాదు. కాని ఇప్పుడు అది కొత్తగా అనిపిస్తోంది. అలాగే ఖిల్లాలోపల వుందామని రజియా చెప్పడం కూడా కొత్త కాదు. కానీ ఇప్పుడది చాలా కొత్తగా అనిపిస్తోంది. కానీ, మున్నాకి ఈ గొడవంతా ఎందుకూ?

వాడి చిన్న ప్రపంచంలో ఏం జరుగుతోంది?

నిద్ర పట్టడం లేదు.


నేనేదో కలలో బతుకుతున్నానా?

నిజమే. ఇప్పటిదాకా మున్నాకి ఈ గొడవలేమీ తెలియవు. ఎప్పుడన్నా చికాకు పుడితే ఖిల్లాలో వుందాం పద అని రజియా అంటుంది తప్ప.

ఖిల్లాలోపల వుండడానికి నిజానికి నాకు ఏమాత్రం మనసొప్పలేదు. రజియా, అహ్మద్ సాబ్ చాలా ఇళ్ళు చూసిపెట్టారు. ఏదో వొక కారణం మీద వాటన్నిటినీ తిరగ్గొట్టాన్నేను. దానికి చాలా పెద్ద కారణం- నాకు గోడలంటే అసహ్యం.

ఎత్తయిన గోడల మధ్య బతకడం అంటే అంతకంటే అసహ్యం. ఈ ఖిల్లా ఏనాటిదో ఎవరికీ తెలియదు. కానీ, ఈ ఎత్తయిన గోడల మధ్య బతుకు నాకు బందిఖానా అనిపించింది. నేను పనిచేసే చెప్పుల షాపు మాలిక్ ఖిల్లాలోనే వుంటాడు.

'ఖిల్లాలోపల ఇల్లు తీసుకోండి. ఇక్కడయితే పిల్లలకు దీనీ మాలుమాత్ వుంటుంది. ఆడవాళ్ళకి కూడా భద్రత' అన్నాడాయన నేను పనిలో చేరిన రెండోరోజే. కాదనలేక నేను ఒకసారి ఖిల్లా లోపలికి వెళ్ళి చూసి వచ్చాను. చుట్టూ ఎత్తయిన గోడలు, లోపలికి ప్రవేశించడానికి వొక సింహద్వారాం. ఖిల్లా లోపలికి అడుగు పెట్టిన తర్వాత నేను వేరే లోకంలో వున్నానా అనిపించింది. ఇక్కడి ఇళ్ళూ, మనుషులూ అంతా పరాయివాళ్ళలా అనిపించారు.



నాకు అలవాటైన నా వూరి వాతావరణం అక్కడ లేదు. బురఖాలు నాకు కొత్త కాదు, టోపీలు కొత్త కాదు, గడ్డాలు కొత్తకాదు. అమ్మ ఎప్పుడూ బురఖాలోనే వుండేది. రజియా ఇప్పటికీ బురఖా లేకుండా బయటికి వెళ్ళదు. నాన్నకి గడ్డం వుండేదికాదు కానీ, మా వూళ్ళో వుండగా గడ్డాలవాళ్ళు ఇంటికి బాగానే వచ్చేవాళ్ళు. ప్రతి శుక్రవారం నేనూ, నాన్న టోపీలు పెట్టుకుని జుమ్మేకి నమాజ్ చదివేవాళ్ళం. కాని, ఇక్కడ నేను చూస్తున్నదేమిటి? ఇది పూర్తిగా కొత్తలోకం. గడ్డం లేని ప్రతి మనిషినీ ఇక్కడ గుచ్చిగుచ్చి చూస్తున్నట్టుగా వుంది. పైగా నేను వెళ్ళింది శుక్రవారంపూట కావచ్చు. నమాజ్ వేళ నేను మసీదులోంచి కాకుండా ఎక్కడినుంచో రావడం ఇంకాస్త వింతగా అనిపించి వుండవచ్చు. కాని, నన్ను ఎవరైనా అనుమానంగా చూడడమేనాకు కొత్తగావుంది, చికాకుగా వుంది. ఈ గోడల మధ్య నేను వొక్క క్షణం కూడా వుండలేననిపించింది. వెంటనే ఖిల్లాలోంచి బయటికివచ్చేశాను. 'అమ్మయ్య' అనుకున్నాను. అప్పుడు కాస్త గాలివీచి, నావొళ్ళు తేలికపడింది.


ఆ పుస్తకాలు చదువుతున్నానన్న మాటే కానీ, అందులో వొక్క ముక్క కూడా నాకు ఎక్కడం లేదు. అదే సంగతి సత్యాన్ని అడి గితే- 'అన్నీ అర్థం కావాలా? మీవాళ్ళు ఫజర్ నుంచి ఇషాదాకా చదివే దాంట్లో వొక్క ముక్క కి అర్థం చెప్పమను. మా వాళ్ళు ప్రతిదానికీ మంత్రాలు చదువుతారు కదా, వొక్కటంటే వొక్కటి వీళ్ళకి అర్థమై చచ్చిందా?' అనేవాడు సత్యం.


ఈ ఆరుబయలు ఖైదుకన్నాఈగోడల బయట ఎక్కడ బతికినా పర్లేదనుకున్నాను. షాపుకి ఎలాగూ చాలాదూరమే నడిచి వెళ్ళాలి. స్టేషన్ బజార్ చుట్టుపక్కల ఇళ్ళు దొరకడం కనా కష్టం. కాబట్టి, కనీసం మున్నా బడికి దగ్గిరగా తీసుకుంటే చాలనుకున్నా. వెతికితే, మామిళ్ళగూడెంలో ఓ చిన్న ఇల్లు కిరాయికి దొరికింది.

ఆ సంగతే అహ్మద్‌సాబ్‌కి చెబితే ఆయన మొహం మూడు వంకర్లు తిప్పాడు.

'బోలెతో నై సున్తే బాతుమ్ (ఎంత చెప్పినా వినే రకానివి కాదు, నాయనా నువ్వు) ఖిల్లాలో కాకపోతేమానె, ఇంకో ముసల్మాన్ గల్లీయే దొరకలేదా నీకు ఇంత టౌన్‌లో?' అన్నాడాయన.

'అంతా వెతికాను. ఈ మామిళ్ళగూడెంలో కూడా ముసల్మాన్‌లున్నారు. పైగా, మున్నా స్కూలుకి బాగా దగ్గిర'.

'మున్నాకి తెలుగూ, ఇంగ్లీషు చదువే కానీ, దీనీ మాలుమాత్ అక్కర్లేదా?'

'అవి ఎలాగూ మనం ఇంట్లో చెప్పుకుంటాంగా'

'ఎంత చెప్పినా, చుట్టూ అప్నేలోగ్, అప్నా మాహౌల్ (మనవాళ్ళు, మన వాతావరణం) వుండాలి. లేకపోతే కష్టం'

అని ఆయన ఇంకో రెండు మూడు ఇండ్లు చూపించాడు. కాని నాకు అవి పెద్దగా నచ్చలేదు. మామిళ్ళగూడెం ఇల్లే ఖాయం చేసుకుని, రజియానీ, మున్నానీ టౌన్‌కి తీసుకువచ్చాను. కాని, వచ్చినప్పట్నించీ రజియా ఏదో వొక కారణం మీద ఖిల్లా లోపలకి వెళ్ళిపోదామని సతాయిస్తూనే వుంటుంది. కాని, ఆ విషయంలో నేను కచ్చితంగా వుండదలిచాను. రజియా కానీ, అహ్మద్‌సాబ్‌కానీ చెప్పే కారణాలు నాకు సబబు అనిపించలేదు.

ఇప్పుడు రజియాకి మంచి అవకాశం దొరికినట్టయింది.

మసీదు కూల్చి ఇప్పటికి వారం రోజులైంది. అక్కడెక్కడో మసీదు కూల్చితే ఇక్కడేమిటి నీ గొడవ అని విసుక్కుంటున్నా ఆమె వినదు. రోజూ టీవీ ముందు కూర్చొని, ఆ గొడవంతా కళ్ళు విప్పార్చి చూస్తుంది. 'దేఖో...ఎలా కూల్చేసారో చూడండి. ఉస్‌కీ సూరత్ (వాడి మొహం) చూస్తేనే నాకు చిర్రెత్తుకొస్తుంది (వాడు అంటే పీవీ నరసింహారావ్). అంతా ముందే తెలుసట. అనుకునే చేసారట. వీళ్ళంతా వొక్కటే. ఇక్కడ మనమే పరాయి వాళ్ళం. మీకు ఎంత చెప్పినా సమజ్ కాదు'.

ఆ మధ్యాన్నం నుంచీ రజియా ఇంటినుంచి బయటికి వెళ్తే వొట్టు. 'తీసుకొచ్చి ఈ కొంపల మధ్య దింపారు. బయటికి అడుగు పెట్టాలంటే భయంతో చచ్చిపోతున్నాను. బురఖాల్ని చూసి వూరుకుంటారా?'

'అయితే, బురఖా తీసేసి వెళ్ళు'.

'ఆ ...బొట్టు కూడా పెట్టుకుని వెళ్తా'

'మసీదు కూలిపోయినప్పట్నించీ వొక్కక్కతీ రూపాయి బిళ్ళంత బొట్టు పెట్టుకుని తిరుగుతోంది. పఖర్‌గా' కోపంగా అనుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

ఈ మార్పు చాలా ఆశ్చర్యం!

రజియా ఏనాడూ చుట్టుపక్కల వాళ్ళని పరాయివాళ్ళుగా చూడలేదు.మరీ దగ్గిరవాళ్ళుగా కూడా చూడలేదు, అది వేరే సంగతి. కాని ఇవాళ వాళ్ళ వేషభాషలు, కట్టుబొట్టూ కూడా ఆమె చాలా దగ్గిరగా గమనిస్తోంది. గమనించడమేకాదు, అవన్నీ ఇప్పుడామెకు కుట్రలా అనిపిస్తున్నాయి.

నాకు ఏమీ అనిపించడం లేదేమిటి?

నాలో తురకదనం చచ్చిపోయిందా? ఏమో?

మసీదు కూల్చడం అన్యాయమే. కాని మసీదు కోసం ఇన్ని జరగడం నాకు అంతకంటే అన్యాయంగా అనిపిస్తోంది. పైగా, అది మా మూలుగా రోజువారీ నమాజ్‌లు చదివే మసీదు కాదు. ఆ విషయమే రజియాకి చెబితే 'మీలాంటివాళ్ళు పండక్కి కానీ నమాజ్ చదవరు. ఇంక కొన్నాళ్ళు పోతే దేశంలోని మసీదులన్నీ అలాగే పాడుబడిపోతాయి, వాటినిల్లాగే కూల్చేసి గుళ్ళూ, గోపురాలు కట్టేస్తారు' అని మళ్ళీ నా మీదికి బాణం గురిపెట్టింది.

అయినా, దేశంలో మసీదులూ, గుళ్ళూ, గోపురాలు ఏమైతే నాకేం? ముందు మున్నా సంగతి ఆలోచించాలి.

** ** **

నేను సాయంత్రం ఇంటికి వచ్చేసరికి మున్నా ఇంట్లోనే ఆడుకుంటున్నాడు. నేను రాగానే కాళ్ళూ, చేతులు కడుక్కుని, మున్నాతో ఆడుకోవడం మొదలెట్టాను.

వాడే చెప్పడం మొదలెట్టాడు.

'ఇవాళ కూడా శీను నాతో ఆడలేదు అబ్బా!'

'ఏమైంది?'

'పాకిస్తాన్ నీ పిలక పీకిస్తాన్ అని కూడా అన్నాడు'

'అదేమిటి?'

'మన్ది పాకిస్తానట కదా!'

'అదేంకాదు, పాకిస్తాన్ మన్ది కాదు...' అనేసరికి రజియా చప్పున ముందు గదిలోకి విసవిసా వచ్చింది.

'మీకేం తెలుసు ఏది పాకో, ఏది కాదో?'

'మనం వున్నచోటే పాక్...' అన్నాన్నేను.

'అవును, ఈ పెద్ద పెద్ద బొట్లూ, రాతి దేవుళ్ళూ.... మసీదులు కూల్చి గుళ్ళు కట్టుకోడాలు... ఇదే పాక్!'

'రజియా, బాబు ముందు ఇవన్నీ వద్దు'

'వాడికి మీకంటే బాగా తెలుసు'.

అనేసి ఇషా నమాజ్‌కి సిద్ధమైంది రజియా.

నేను మున్నాని దగ్గిరకు తీసుకున్నాను.

'అబ్బా, మనం పాకిస్తాన్ వెళ్ళిపోవాలట'

'ఎవరు చెప్పార్రా?'

'మొన్న శీను చెప్పాడు, ఇవాళ బాలుచెప్పాడు'

'వాళ్ళకి తెలీదు'

'మరి మనం ఇక్కడ ఎందుకు? మనూరు వెళ్ళిపోదాం'

'సరే, చూద్దాంలే. మనిద్దరం కాసేపు ఏమన్నా ఆడుకుందాం' అని వాణ్ణి మభ్యపెట్టే ప్రయత్నం చేశాను. కాని వాడు వినేట్టుగా అనిపించలేదు.

నమాజ్‌లో నిలబడి వున్న రజియా పక్కకి వెళ్ళి నిలబడ్డాడు తల్లిని అనుకరిస్తూ.

వాడికి నచ్చచెప్పే/ మభ్యపెట్టే సామర్థ్యం నాకు లేకపోయింది.

ఎందుకంటే, నాలోపల నాకే స్పష్టంగా లేని విషయాల్ని వాడికి స్పష్టంగా చెప్పే శక్తి నాకు లేదు. రజియాకి ఓ స్పష్టత వుంది. మన వాళ్ళు/కానివాళ్ళ మధ్య ఆమె గీసుకున్న గీత స్పష్టంగా వుంది. ఆమె ఆ గీతమీద నిలబడి అనాల్సిందేమిటో అనేస్తుంది.

నేనేమీ అనలేకపోతున్నాను.

మొదటిసారిగా నా చదువు మీదా, నా లోక జ్ఞానం మీద నాలో సందిగ్ధావస్థ మొదలైంది.

అవును, నేనెవర్ని?

మసీదు కూల్చేశారంటే నేను రజియాలా ఎందుకు అంతగా బాధపడడం లేదు?

చుట్టుపక్కల జనాల్లోవచ్చిన తేడాని మున్నా కూడా గుర్తిస్తున్నాడే, నాకు ఎందుకు ఆ తేడా కనిపించడం లేదు?

నాతో మాట్లాడేవాళ్లు, నేను మాట్లాడేవాళ్ళు మసీదు పతనం గురించి ఏమనుకుంటున్నట్టు?

**నేను పేపర్ చదువుతాను, పేపర్ చంకలో మడతపెట్టుకుని షాపుకి వెళ్తాను. అక్కడ క్షణం తీరిక వుండదు. రాత్రి ఎనిమిదిదాకా కస్టమర్లు వుంటారు. అహ్మద్‌సాబ్ అయిదు పూటలా నమాజ్, వచ్చే పోయేవాళ్ళతో మాట్లాడుకోవ డం... క్యాష్ దగ్గిరే కూర్చుంటారు. పని అంతా నా వొక్కడిదే. నాకు తెలిసిన మాటలు కొన్నే.**

సత్యం ఇక్కడ లేదు. సీతారాములు ఇక్కడ లేదు. ఇక్కడ నేను మాట్లాడేదల్లా అహ్మద్‌సాబ్‌తో. సరే, ఆయన అభిప్రాయాల మీద నాకు పెద్ద గురి లేదు.

కాని, అసలు నేనెందుకు ఇంత స్తబ్దంగా వున్నాను?

ఇప్పటికీ నాకు మసీదు పతనం కంటే, మున్నాతో ఆడుకునేవాళ్ళు ఎవరూ లేరన్నదే పెద్ద సమస్య.

అవును, నేను మున్నా వైపు నుంచి ఈ చుట్టుపక్కల వాళ్ళని చూడడం నేర్చుకోవాలేమో?

నేనా వాళ్ళతో పెద్దగా కలిసేది లేదు. ఏదో నమస్కారం అంటే నమస్కారం. సలాం అంటే వాలెకుం సలాం.

అందరితోనూ నేను అంటీముట్టనట్టే వున్నాను ఈ టౌన్‌లో.

అంత దగ్గిరగా వెళ్ళే సంబంధాలేమీ లేవీ నాకు వీళ్ళతో ఏర్పడలేదింకా.

నాకంటే రజియా నయం. పంచదార కోసం వచ్చే చుట్టుపక్కలవాళ్ళు, కూరగాయల బండ్ల వాళ్ళు... నీళ్ళ పంపు దగ్గిర కలిసేవాళ్ళు... ఆమె కోసం వచ్చే ముస్లిం ఆడవాళ్లు. నాకంటే ఆమె లోకం పెద్దది.

నేను పేపర్ చదువుతాను, పేపర్ చంకలో మడతపెట్టుకుని షాపుకి వెళ్తాను. అక్కడ క్షణం తీరిక వుండదు. రాత్రి ఎనిమిదిదాకా కస్టమర్లు వుంటారు. అహ్మద్‌సాబ్ అయిదు పూటలా నమాజ్, వచ్చే పోయేవాళ్ళతో మాట్లాడుకోవడం... క్యాష్ దగ్గిరే కూర్చుంటారు. పని అంతా నా వొక్కడిదే. నాకు తెలిసిన మాటలు కొన్నే.

'ఏ సైజు...'

'కాలు ఇక్కడ పెట్టండి సార్'

'ఇది చాలా కాలం మన్నుతుంది సాబ్'

'ఏ కలర్?'

'ఈ కలర్ ఇప్పుడంతా గిరాకీ మేడమ్'

ఇవే నా మాటలు.

ఇవి కాకుండా నాకు తెలిసిన వేరే మాటలు నాకు తెలుగు పేపర్‌లో కొన్ని తెలుసు. కాని, పేపర్ చదివే తీరికెక్కడిది? నేను కాస్త పేపర్ విప్పబోతే, అహ్మద్‌సాబ్ 'సియాసత్ దేఖో భాయ్' అంటూ ఉర్దూ పేపర్ ఇవ్వబోతారు.

ఇంక నేను ఇంటికొచ్చి ఏమన్నా చదవబోతే మనసు నిలవదు.

మున్నాతో కాసేపు ఆడుకుని, ఆ తర్వాత పడక!

నా లోకం చాలా ఇరుగ్గా వుందని ఇప్పుడే అనిపిస్తోంది.

కనీసం మున్నాకి తెలిసిన లోకం కూడా నాకు తెలియడం లేదు.

** ** **

అవే ఆలోచనల్లో నేను మంచం మీదికి చేరేసరికి పదిగంటలైంది.

రజియా నిద్రలో వుంది.

మున్నా అటూ ఇటూ మసలుతున్నాడు.

నేను వాడి పక్కన పడుకోబోయాను.

వాడు చప్పున నన్ను అతుక్కుపోయాడు.

వాడి నెత్తి మీద జుట్టు సవరించాను.

'అబ్బా, ఏ హమారా గామ్ నై' అంటున్నాడు వాడు.

నాకు ఏడుపొచ్చేసింది.

నిజమే, కాని మనదే వూరు?

నేను వాణ్ణి దగ్గిరకు తీసుకున్నాను.

'మనం వెళ్ళిపోదాం మనూరు?'

నిజమే, ఏ వూరు మనది?

వదిలేసిన వూళ్ళో మాత్రం ఏముంది?

అక్కడా ఇంతే కదా?

ఈ టౌన్‌లో కనీసం నలుగురికీ మన కులమేంటో, మతమేంటో తెలీదు అనుకున్నాను.

ఇక్కడా ఇంతే కదా?

ఇంక ఏ వూరెళ్ళాలి?

'పాకిస్తాన్ నీ పిలక పీకిస్తాన్...'

నిద్రలో అంటున్నాడు మున్నా.

నేను ఏదీ కాదు.

నేను ఎక్కడికీ వెళ్ళలేను.

నేను తెలంగీ పత్తా...

అవున్నిజమే!

ఆలోచనల్లో పడ్డాను.

ఇంక ఈ రాత్రి నిద్ర లేదు!

** ** **

**(తెలంగీ పత్తా=తెలుగు మాత్రమే మాట్లాడే ముస్లింలని తెలంగాణాలో కొన్నిచోట్ల తెలంగీ పత్తా అంటారు. అంటే తెలుగు ఆకు అని అర్థం.**

**దీనీ మాలుమాత్=స్వమత జ్ఞానం**

**ఖిల్లా=కోట. తెలంగాణాలో కొన్ని ముస్లిం వాడలు ఖిల్లాలోపల వుంటాయి.)**